TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 317 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ శనివారం.13.06.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## తెలంగాణలో పోటీ చేసేందుకు పవన్ కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉంది: సీఎం రేవంత్




న్యూఢిల్లీ, అమృత్ తెలంగాణ: తెలంగాణకు వచ్చేందుకు.. వెళ్లేందుకు.. పోటీ చేసేందుకు.. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే.. పవన్ కల్యాణ్‌పై తమ మంత్రులు మాట్లాడారన్నారు. తనకు హిట్లర్ ఆదర్శం అని తానెప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఉన్నవారు ఎవరైనా.. హిట్లర్ తమకు ఆదర్శం అని చెబుతారా? అని ప్రశ్నించారు. పార్టీ అధిష్ఠానంతో జరిగిన సమావేశంలో మంత్రివర్గ విస్తరణపై చర్చ జరగలేదని చెప్పారు.

ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన భేటీలో తనను ఆయనే కౌగిలించుకున్నారని .. తాను కౌగిలించుకోలేదని సీఎం రేవంత్ వెల్లడించారు. తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతోందని సీఎం రేవంత్ ఆరోపించారు. బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాలను ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాటిస్తున్నారని విమర్శించారు. పలు ప్రాజెక్టులకు నిధులు విడుదల కాకపోవడానికి కిషన్‌రెడ్డే కారణమని కుండబద్దలు కొట్టారు. రీజినల్ రింగ్ రోడ్డుకు కూడా కిషన్‌రెడ్డి అడ్డుపడ్డారని గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి కోసం మహారాష్ట్ర సీఎంతో కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తెలంగాణ కోసం ప్రధానితో ఒక్కసారైనా మాట్లాడారా? అని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు.

గాడ్సేనే కాదు.. కిమ్‌ను కూడా బీజేపీ ఆదర్శంగా తీసుకుందని సీఎం రేవంత్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. బీజేపీకి తెలిసింది ఓట్ చోరీ.. లేకపోతే సీట్ చోరీ అని ఎద్దేవా చేశారు. మధ్యప్రదేశ్‌లో సంఖ్యాబలం లేకపోయినా మూడో అభ్యర్థిని నిలబెట్టినప్పుడే బీజేపీ దుర్బుద్ధి బయటపడిందన్నారు. మీనాక్షి నామినేషన్ తిరస్కరణ అప్రజాస్వామిక చర్య అని అభివర్ణించారు. ఆమె నామినేషన్ తిరస్కరణ అత్యంత బాధాకరమన్నారు. మీనాక్షి నటరాజన్‌పై అసలు కేసే లేదని స్పష్టం చేశారు. మహిళా వ్యతిరేకి బీజేపీ అని సీఎం రేవంత్ విమర్శించారు.

## మరోసారి తెలంగాణ పై పవన్ కీలక వ్యాఖ్యలు



అమరావతి, అమృత్ తెలంగాణ: ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తెలుగు రాష్ట్రాల సామాజిక, రాజకీయ పరిస్థితులపై చేసిన సరికొత్త వ్యాఖ్యలు ఇప్పుడు ఉమ్మడి రాష్ట్రాల్లో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. తిరుపతిలో జరిగిన ఒక బహిరంగ సభ వేదికగా ఆయన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల భవిష్యత్తు మరియు అభివృద్ధిపై కీలకమైన విశ్లేషణ చేశారు. తెలుగు రాష్ట్రాలు రెండు కూడా దేశంలోనే మరింత శక్తివంతంగా ఎదగాలంటే, ఇప్పటివరకు ఉన్న కొన్ని సంకుచిత పరిమితులను దాటాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలోనే "ఒక రాష్ట్రం కులాల పరిమితులు దాటాలి, మరొక రాష్ట్రం ప్రాంతీయత పరిమితులు దాటాలి" అంటూ పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు ఉభయ రాష్ట్రాల రాజకీయ, సామాజిక వర్గాల్లో ఆసక్తికరమైన చర్చను లేవనెత్తాయి.

నెటిజన్ల భిన్నాభిప్రాయాలు

పవన్ కళ్యాణ్ చేసిన ఈ వ్యాఖ్యల వెనుక ఉన్న అంతరార్థంపై సోషల్ మీడియా వేదికగా నెటిజన్ల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాలు ఎక్కువగా కులాల చుట్టూ తిరుగుతుంటాయని, అందుకే ఏపీ కులాల పరిమితులను దాటాలని ఆయన ఉద్దేశించారని చాలామంది విశ్లేషిస్తున్నారు. అదే సమయంలో, తెలంగాణలో ప్రాంతీయ సెంటిమెంట్ బలంగా ఉంటుందని, కాబట్టి తెలంగాణ ప్రాంతీయతను దాటి ఆలోచించాలనేది ఆయన భావన అని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రాలు తమ అంతర్గత విభేదాలను, సంకుచిత భావాలను పక్కనబెట్టి, మనమంతా ఒకటే అనే 'భారతీయత' వైపు అడుగులు వేసినప్పుడే అసలైన ప్రగతి సాధ్యమవుతుందన్న పవన్ కళ్యాణ్ పిలుపుపై ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లో భిన్న కోణాల్లో చర్చ జరుగుతోంది.

## మీనాక్షి నటరాజన్ పిటిషన్ ను తిరస్కరించిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ అమృత్ తెలంగాణ:రాజ్యసభ నామినేషన్ పత్రాల తిరస్కరణను సవాలు చేస్తూ కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన పిటిషన్ ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 329 ప్రకారం.. కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియలో న్యాయపరమైన జోక్యం నిషిద్ధమని జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎ.ఎస్ చందూర్కర్ లతో కూడిన ధర్మాసనం శుక్రవారం పేర్కొంది. "ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో జోక్యం చేసుకోవడానికి ఈ కోర్టు లేదా హైకోర్టు రిట్ అధికార పరిధిని వినియోగించుకునే ప్రయత్నం జరిగిన ప్రతిసారి, రాజ్యాంగంలోని ఆర్టికల్ 329లో పొందుపరిచిన నిబంధనలను దృష్టిలో ఉంచుకుని కోర్టు ఆ ప్రయత్నాలను తిరస్కరించింది" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇటువంటి అంశాల్లో ఎన్నికల పిటిషన్ దాఖలు చేయడమే సరైన పరిష్కార మార్గమని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. నామినేషన్ పత్రాల తిరస్కరణలో స్పష్టమైన, సుస్పష్టమైన లోపాలకు మినహాయింపు ఇవ్వడమంటే.. ఆర్టికల్ 329లో ఉనికిలో లేని ఒక సూత్రాన్ని జోడించడమేనని పేర్కొంది. అయితే తాము చేసిన పరిశీలనలు, సంబంధిత హైకోర్టులో దాఖలు చేయనున్న ఏ ఎన్నికల పిటిషన్ పైనా ఎటువంటి ప్రతికూల ప్రభావాన్ని చూపవని స్పష్టం చేసింది.

## అన్నీ తాకట్టు పెట్టేవాళ్లకు మాట్లాడే అర్హత లేదు - డబుల్ ఇంజిన్ సర్కార్ ఫలితాలు చూస్తున్నాం: చంద్రబాబు



దామినేడు, అమృత్ తెలంగాణ: స్వర్ణాంధ్రే శ్వాసగా పాలన సాగిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. హామీల అమలుతో నిజాయితీ నిరూపించుకుంటున్నామని తెలిపారు. సంపద సృష్టిస్తేనే సంక్షేమం గురించి చెప్పాలి, ఆదాయాన్ని పెంచేవాళ్లకే సంక్షేమం పంచే అధికారం ఉంటుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. అన్నీ తాకట్టు పెట్టే వాళ్లకు రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదని స్పష్టం చేశారు.

గత ప్రభుత్వంలో ఎమ్మార్వో ఆఫీసు, ఆసుపత్రులను కూడా తాకట్టు పెట్టారని చంద్రబాబు గుర్తు చేశారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం' పేరుతో తిరుపతి సమీపంలోని దామినేడులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్కల్యాణ్, మంత్రి లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కూటమి నేతలు పాల్గొన్నారు. అలాగే కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.


నా రాజకీయ ప్రయాణం తిరుపతిలోనే : ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, "నా రాజకీయ ప్రయాణం తిరుపతిలోనే మొదలు పెట్టా. ఇదే రోజున నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశా, రెండేళ్లయింది. రాష్ట్రాన్ని గెలిపిద్దామని 2024 ఎన్నికల్లో మోదీ, పవన్, నేను కలిశాం. ప్రజల ఆశీర్వాదంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. విభజన వల్ల కొంత నష్టపోతే, గత ప్రభుత్వం వల్ల పూర్తిగా నష్టపోయాం.

2019లో ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంసం ప్రారంభమైంది. విధ్వంస పాలన వల్ల వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి. గత ప్రభుత్వ విధ్వంసంతో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయారు. తప్పుడు కేసులు పెట్టి జైళ్లకు పంపి వేధించారు. ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా నన్ను 53 రోజులు జైల్లో ఉంచారు. పవన్ కల్యాణ్‌ను అడుగడుగునా అడ్డుకొని వేధించారు. మూడు రాజధానుల పేరుతో మూడుముక్కలాట ఆడి చిచ్చు పెట్టారు" అని చంద్రబాబు విమర్శించారు.

వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ : ఎన్నికల్లో విజయం చూసి పొంగిపోలేదు, రాష్ట్ర దుస్థితి చూసి కుంగిపోలేదని చంద్రబాబు అన్నారు. హంద్రీనీవా పూర్తి చేసి కుప్పానికి నీళ్లు తీసుకొచ్చామని గుర్తుచేశారు. ఈ ఏడాది కల్యాణి డ్యామ్‌కు నీరు తీసుకొచ్చి, శ్రీశైలం మల్లన్న, తిరుపతి వెంకన్నను కలుపుతామన్నారు. అన్ని రంగాలపై ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశాం, ప్రజా ప్రభుత్వం నడిపించే వ్యక్తిగా అన్ని వివరాలు బహిర్గతమే ఉంటాయన్నారు. డబుల్ ఇంజిన్ సర్కారు వల్ల ప్రయోజనాలు ఇవాళ చూస్తున్నామని తెలిపారు. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చి కేంద్రం బతికించిందని తెలిపారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామన్నారు.

"పోలవరం, అమరావతి, విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ సహా అనేక విషయాల్లో కేంద్రం అండగా నిలిచింది.

## నీట్ రీ ఎగ్జామ్ మార్పులు- రఫ్ వర్క్ పేజీల రెట్టింపు- సమయాన్ని పెంచిన ఎన్టీఏ






న్యూఢిల్లీ, అమృత్ తెలంగాణ: వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న నీట్ రీ ఎగ్జామ్ 2026లో జాతీయ పరీక్షల సంస్థ-ఎన్ టి ఏ కొన్ని మార్పులు చేసింది. ఈ నెల 21న దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష జరగనుండగా విద్యార్థుల సౌకర్యార్థం సమయాన్ని మరో 15 నిమిషాలు పొడిగించింది. ఈ నెల 21 మధ్యాహ్నం 2గంటల నుంచి 5 గంటల 15 నిమిషాల వరకూ పరీక్ష జరుగుతుందని ఎన్ టి ఏ ప్రకటించింది. మొత్తంగా ఈ పరీక్ష 195 నిమిషాల పాటు జరగనుంది. పరీక్ష ప్రారంభానికి ముందు, ముగిసిన తర్వాత ఇన్విజిలేషన్ ప్రక్రియకు పెంచిన సమయం ఉపయోగపడుతుందని తెలిపింది. అభ్యర్థుల నుంచి గత కొన్నేళ్లుగా వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ఈ మార్పులు చేశామని ఎన్ టి ఏ తెలిపింది.

రఫ్ వర్క్ కోసం ఇచ్చే పేజీలను రెట్టింపు చేసినట్లు వెల్లడించింది. ప్రశ్నపత్రం బుక్‌లెట్‌లో రఫ్ వర్క్ కోసం ఇప్పటివరకూ రెండు పేజీలు ఇస్తుండగా ఈసారి 4 పేజీలు ఇవ్వనున్నట్లు ఎన్ టి ఏ పేర్కొంది. ఎడమచేతి వాటం ఉన్న విద్యార్థులకు ఉపయోగపడేలా ప్రశ్నపత్రం మొదట్లో, చివరిలో రెండేసి రఫ్ పేపర్లను ఏర్పాటు చేసినట్లు వివరించింది. గతంలో, రఫ్ వర్క్ పేజీలు కేవలం ప్రశ్నపత్రం బుక్‌లెట్ చివరలో మాత్రమే ఉండేవి. సవరించిన విధానం ప్రకారం, సూచనల పేజీ తర్వాత వెంటనే రెండు రఫ్ వర్క్ పేజీలు ఉంటాయి, అలాగే మరో రెండు అదనపు పేజీలు బుక్‌లెట్ చివరలో ఉంటాయి. ఈ కొత్త విధానం ప్రశ్నపత్రం ఇంగ్లీష్, ప్రాంతీయ భాషా వెర్షన్లు రెండింటిలోనూ ప్రవేశపెట్టారు.

"పరీక్ష ప్రారంభం, ముగింపులో ఉండే ఇన్విజిలేషన్ ప్రక్రియ (ఉదాహరణకు సంతకాలు చేయడం వంటివి) తమ అసలు పని సమయాన్ని తగ్గిస్తున్నాయని అభ్యర్థులు గతంలో భావించేవారు. ఆ సమయాన్ని కూడా పరిగణనలోకి తీసుకునేలా సమయ వ్యవధిని రూపొందించాం. ఈ ప్రక్రియలతో సహా మొత్తం సమయాన్ని 195 నిమిషాలుగా నిర్ణయించాం. అభ్యర్థులు లెక్కలు, విశ్లేషణలు చేసుకోవడానికి వీలుగా ప్రశ్నపత్రం బుక్‌లెట్‌లో రఫ్-వర్క్ కోసం కేటాయించిన పేజీల సంఖ్యను రెండు పేజీల నుంచి నాలుగు పేజీలకు పెంచాం. ఇప్పుడు బుక్‌లెట్‌లో ముందు, వెనుక భాగాల్లో రఫ్-వర్క్ పేజీలు అందుబాటులో ఉంటాయి. దీనివల్ల ప్రతి అభ్యర్థి సౌకర్యవంతంగా పరీక్ష రాయవచ్చు. ముఖ్యంగా మొత్తం అభ్యర్థుల్లో దాదాపు 10శాతం మంది ఉండే ఎడమ చేతి వాటం అభ్యర్థులకు ఇది ఎంతో సహాయపడుతుంది." --- నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ

"పరీక్షా విధానంలో చేసే చిన్న, ఆలోచనాత్మకమైన మార్పులు కూడా అత్యంత కీలకమైన పరీక్షా సమయంలో అభ్యర్థి సౌకర్యంలో గణనీయమైన మార్పును తీసుకురాగలవు. నీట్ 2026 పరీక్షను పారదర్శకంగా, సురక్షితంగా అభ్యర్థులకు అనుకూలమైన రీతిలో నిర్వహించడానికి, అలాగే ఈ పరీక్షకు హాజరయ్యే లక్షలాది మంది ఆశావహుల కోసం పరీక్షా విధానాన్ని నిరంతరం మెరుగుపరచడానికి తమకున్న నిబద్ధతను ఎన్ టి ఏ పునరుద్ఘాటించింది." అని ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రతి సంవత్సరం పరీక్షకు హాజరయ్యే లక్షలాది మంది ఆశావహుల కోసం పరీక్షా అనుభవాన్ని మెరుగుపరచడం కొనసాగిస్తామని ఏజెన్సీ చెప్పింది.

వాస్తవానికి మే 3న నీట్ జరగ్గా పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం తీవ్ర దుమారం సృష్టించింది. దీంతో ఎన్టీఏ పనితీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ప్రశ్నపత్రం లీకేజీ కారణంగా దానిని రద్దుచేసి, జూన్ 21న మళ్లీ నిర్వహిస్తోంది.

ఈ క్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధరేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కేసు నమోదు చేసిన సీబీఐ ప్రస్తుతం దర్యాప్తు కొనసాగిస్తోంది.

## మోదీ సర్కార్పై ప్రజల్లో ఆగ్రహం- వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమిదే విజయం: రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ, అమృత్ తెలంగాణ: మోదీ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న ఆగ్రహాన్ని బట్టి చూస్తే, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం ఖాయమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. కానీ అసలు సమస్య ఏమిటంటే, విపక్ష కూటమి గెలవడానికి ఇక్కడ స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలు జరగవు అని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవల దిల్లీలో జరిగిన ఇండియా కూటమి నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

ఐక్యంగా పోరాడదాం

సోమవారం జరిగిన ఇండియా కూటమి సమావేశంలో రాహుల్ మాట్లాడుతూ, విపక్ష నేతలు అందరూ ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. "మనం కలిసికట్టుగా నిలబడి ప్రతిఘటిస్తే బీజేపీని ఓడించడం చాలా సులువు" అని పేర్కొన్నారు. ఇక వామపక్ష పార్టీలతో సహా ఇతర మిత్ర పక్షాలు కాంగ్రెస్పై చేస్తున్న విమర్శలపై గాంధీ స్పందిస్తూ, "నేను విషన్ని మింగిన నీలకంఠుడిని, నాపైగానీ, నా పార్టీపై గానీ వాళ్లు చేసే ఎలాంటి విమర్శలనైనా ముఖ్యంపై చిరునవ్వుతో స్వీకరిస్తాను" అని అన్నారు. శుక్రవారం ఈ ప్రసంగం వీడియోను ఆయన తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు.

# పర్యావరణ పరిరక్షణ, ప్రజల ఆరోగ్య రక్షణే లక్ష్యం: జిల్లా కలెక్టర్ రాజర్షి షా





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్య రక్షణను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఘన వ్యర్థాల నిర్వహణకు నూతన నియమాలను అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో 'స్వచ్ఛ తెలంగాణ' ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలపై అవగాహన కల్పిస్తూ ఏర్పాటు చేసిన పోస్టర్లను ఆవిష్కరించారు. అలాగే వర్మి కంపోస్టు బెడ్స్ (వానపాముల ఎరువు తయారీ షెడ్డు)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలను పకడ్బందీగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ప్రతి గ్రామం, పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పారిశుధ్యం అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ప్రతి ఇంటి నుండి ఉత్పత్తి అయ్యే చెత్తను తడి, పొడి, శానిటరీ, ప్రత్యేక జాగ్రత్త చెత్తగా నాలుగు రకాలుగా వేరు చేసి పచ్చ, నీలం, ఎరుపు, నలుపు రంగుల బుట్టల్లో సేకరించి పారిశుధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. ఇళ్ల నుండి సేకరించిన తడి చెత్తను గ్రామాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వర్మి కంపోస్టు బెడ్స్‌కు తరలించి, నాణ్యమైన సేంద్రీయ ఎరువును తయారు చేస్తామని తెలిపారు. ఈ ఎరువు వ్యవసాయానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలను లేదా చెత్తను తగలబెట్టడం, మురుగు కాలువలు, చెరువులు తదితర జలవనరుల్లో వ్యర్థాలను పడేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. అటువంటి చర్యలకు పాల్పడేవారిపై కఠిన జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. అలాగే భవన నిర్మాణ వ్యర్థాలు, మట్టి, ఇటుకలను రోడ్లపై పోసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యాపార సంస్థలు, హోటళ్లు, మార్కెట్లు, బస్టాండ్ల నిర్వాహకులు తమ పరిసరాల్లో తప్పనిసరిగా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసి పరిశుభ్రతను పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ రవీందర్ రాథోడ్, సీసీలు కార్తీక్, యాసిన్, స్వచ్ఛ భారత్ మిషన్ ప్రతినిధులు, క్యాంపు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాలల్లో విద్యా ప్రమాణాలు, మౌళిక వసతులు పెంచాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు.



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుదల, మౌలిక వసతుల కల్పన, రాబోయే విద్యా సంవత్సర ప్రణాళికలపై ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఇతర విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలల వారీగా విద్యార్థుల ప్రవేశాలు, అందుతున్న విద్యా సేవలు, పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ప్రైవేట్ విద్యాసంస్థలకు తీసిపోని విధంగా నాణ్యమైన విద్యను అందించాలని ఆదేశించారు. రాబోయే పరీక్షల్లో వంద శాతం ఉత్తమ ఫలితాలు సాధించేలా అధ్యాపకులు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రిన్సిపాల్స్‌కు సూచించారు. విద్యా ప్రమాణాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ఈ సందర్భంగా అధికారులను హెచ్చరించారు. అదేవిధంగా, విద్యార్థుల సౌకర్యార్థం ప్రతి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో త్రాగునీరు, మరుగుదొడ్లు, విద్యుద్దీకరణ, ల్యాబ్ సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు డిజిటల్ క్లాస్‌రూమ్‌లను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, ఇంటర్మీడియేట్ విద్యాశాఖ అధికారి గణేష్ జాదవ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఇతర విద్యాశాఖ ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల మోచి బజార్ లో షాట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధం.



జగిత్యాల అమృత్ తెలంగాణ జూన్ 12: జగిత్యాల పట్టణంలోని మోచి బజార్ లో షార్ట్ సర్క్యూట్ తో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గంగాధర్ అనే టేలర్ కు చెందిన ఇంట్లో నిల్వ ఉంచిన దాదాపు 60 కొత్త కుట్టు మిషన్లు కాలిపోయాయి. ప్రమాదంలో సుమారు 8 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితుని ద్వారా తెలుస్తోంది. సమాచారం అందిన వెంటనే జగిత్యాల ఫైర్ స్టేషన్ సిబ్బంది ఇంజన్ తో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. కాగా ప్రమాదానికి సంబంధించి విషయం తెలుసుకున్న జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి -- శ్రీనివాస్, జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్ తదితరులు ప్రమాదానికి గురైన ఇంటిని పరిశీలించి బాధితునితో మాట్లాడారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

## జిల్లాలో జర్నలిస్టులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తాం
## త్వరలో యూనియన్ సభ్యులకు ఐడి కార్డులు అందజేస్తాం
## యూనియన్ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి
## టియుడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాసరావు

జగిత్యాల అమృత్ తెలంగాణ జూన్ 12: జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేసి రాబోయే తరానికి ఆదర్శంగా నిలిచే విధంగా యూనియన్ కార్యక్రమాలు చేపడుతున్నామని,టియుడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాసరావు అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తా సమీపంలో గల టియుడబ్ల్యూజే ఐజేయు అనుబంధ ప్రెస్ క్లబ్ లో శుక్రవారం జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కార్యవర్గ సభ్యుల సహాయ సహకారాలు ఉంటేనే జర్నలిస్టుల సంక్షేమం కోసం వినూత్న కార్యక్రమాలు చేపట్టి సక్సెస్ అవుతాం అన్నారు. జిల్లాలోని యూనియన్ సభ్యులందరికీ ఐడి కార్డులు అందజేసే దిశగా పని చేస్తున్నామని, అందులో 70 శాతం కార్డులు పూర్తయ్యాయని తెలిపారు. మిగతా సభ్యుల వివరాలు త్వరగా పంపిస్తే ఈ నెలాఖరు వరకు ఐడి కార్డులు పంపిణి చేయనున్నట్టు వివరించారు. అక్రిడేషన్ కార్డుల పట్ల అపోహలు వద్దని, అర్హులైన ప్రతి ఒక్క జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు అందేలా యూనియన్ పక్షాన కృషి చేస్తామన్నారు. జిల్లాలో అక్రిడేషన్ కార్డుల జారీ పక్రియ ఇంచార్జి డిపిఆర్వో వల్ల జాప్యం జరిగిందన్నారు. జిల్లాలోఅన్ని పత్రికలకు జివో ఆదారంగా 450 కి పైగా కార్డులు ఇవ్వడానికి కమిటి ఆమోదం తెలిపిందన్నారు. అర్హులకు కార్డు రాకపోతే కొట్లాడదాం కాని అనర్హులు మాత్రం కార్డు పొందరాదన్నారు. జర్నలిస్టులుగా సమాజం కోసం పని చేసే అర్హులైన వారందరికీ కార్డులను అందజేసేలా చూస్తామన్నారు. వృత్తిలో కొనసాగుతున్న జర్నలిస్టులందరికీ మొదటి విడత కార్డులు జారీ చేస్తారని వివరించారు. జిల్లాలో జర్నలిస్టుల కోసం శిక్షణా తరగతులు పెట్టుకోవాలని రాష్ట్ర కార్యవర్గానికి తెలిపామని, మీడియా అకాడమి తరుపున శిక్షణా తరగతులు నిర్వహిస్తారన్నారు. ఈ శిక్షణా తరగతులకు 50 నుండి 60 మంది జర్నలిస్టులే అర్హులు కావున జిల్లాలో 3 చోట్ల శిక్షణా తరగతులు కావాలని అకాడమీ చర్మెన్ ను కోరామని చెప్పారు. త్వరలోనే నియోజకవర్గాల వారీగా ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తాం అన్నారు. త్వరలో జర్నలిస్టులకు, వారి కుటుంబాలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా అధికారులతో చర్చించామన్నారు. యూనియన్ కార్యవర్గ సభ్యులు కార్యక్రమాల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ముందుండాలని పిలుపునిచ్చారు. యూనియన్ పక్షాన జర్నలిస్టులకు క్రీడా పోటీలు నిర్వహిస్తాం అని అన్నారు. యూనియన్ ప్రాతినిధ్యం లేని మండలాలకు ప్రాతినిధ్యం ఇచ్చి ఈసి మెంబర్లను నియమించాలని సూచించారు. త్వరలో జిల్లా కార్యవర్గానికి ఉప కమిటీలు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. సీనియారిటీ ఉన్న



వారికి ఉప కమిటిల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి నెల జిల్లా కార్యవర్గ సమావేశానికి హాజరు కాని వారిని కార్యవర్గం నుండి తొలగిస్తాం అన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో చదివే జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ కల్పించాలని కలెక్టర్ ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని, త్వరలోనే అన్ని మండలాల ఎం ఈ ఓలకు సర్క్యూలర్లు అందుతాయన్నారు. అదేవిధంగా యూనియన్ ను విచ్చిన్నం చేసే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తాం అని హెచ్చరించారు. ఫీల్డ్ లో లేని వారిని యూనియన్ నుంచి తొలగించడం జరుగుతుందన్నారు. కార్యవర్గ సభ్యులందరూ యూనియన్ పటిష్టతకు విభిన్న కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జంకి సంపూర్ణ చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగుల గోపాల్ చారి, ఉపాధ్యక్షులు గడ్డల హరికృష్ణ, హైదర్ అలీ, అల్లే రాము, లోక రమణా రెడ్డి, కోశాధికారి సిరిసిల్ల వేణు గోపాల్, సహాయ కార్యదర్శులు గుర్రం చంద్ర శేఖర్, కోరేపు రాజ్ కుమార్, చింత నరేష్, కార్యవర్గ సభ్యులు మనోజ్, శంకర్ గౌడ్, రఘుపతి రెడ్డి, హరీష్, నరేష్, సాజీద్, జమీర్ అలీ, గౌస్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# అమ్మక పేట గ్రామ శివారులో అనుమానాస్పదంగా వ్యక్తిమృతి

## మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన ఇబ్రహీంపట్నం ఎస్ఐ నవీన్ కుమార్





ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ: జూన్ 12 ఇబ్రహీంపట్నం మండలం అమ్మకపేట గ్రామ శివారులో ఆర్మూర్ పట్టణానికి చెందిన రాణ హాజీ ం/శీ మహమ్మద్, 32సం.లు, కులం: ముస్లిం అను వ్యక్తి తేదీ 05.06.2026 రోజున మోర్తాడు గ్రామంలో పెయింటింగ్ వర్క్ కోసమని అతని స్నేహితులతో కలిసి మోర్తాడ్ పట్టడానికి వచ్చి, పెయింటింగ్ వేస్తుండగా తేదీ:08.06.2026 రోజున వారు ఉన్న స్థలం నుండి ఎవరికి చెప్పకుండా వెళ్ళినాడని అతని కోసం గాలిస్తుంటే అతని ఫోన్ స్విచాఫ్ వచ్చిందని తేదీ 11.06.2026 రోజున అమ్మక పేట గ్రామ శివారులోని పరంపోగు గుట్ట వద్ద మృతుడు చనిపోయి ఉన్నాడని అమ్మకపేటి గ్రామానికి చెందిన ఎండి రంజాన్ మరియు పద్దం వెంకటేష్ అనువారు పొలం పనులకు అటువైపు వెళ్లి చూసి పోలీసులకు సమాచారం అందించగా, ఇబ్రహీంపట్నం ఎస్ఐ నవీన్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని మృతుడి అన్న ఆయన రాణ ఇర్ఫాన్ ం/శీ మహమ్మద్,36 సం.లు అనునతను అతడి తమ్ముడు హాజీ కి మూర్ఛ వ్యాధి ఉందని వడదెబ్బ కారణంగా గాని, మూర్ఛ వ్యాధి వల్ల గాని, మరే ఇతర కారణాల వల్ల గాని మరణించి ఉండొచ్చని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన ఇబ్రహీంపట్నం ఎస్సై నవీన్ కుమార్.

# సీసీఐ కూల్చివేత అక్రమం అన్యాయం – డిసిసి అధ్యక్షులు డా.నరేష్ జాదవ్





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్ ప్రజలకు ఉపాధి కల్పించే విధంగా జిల్లా కేంద్రంలో గతం లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో హయాంలో సిమెంట్ కర్మాగారం సిసిఐ ఏర్పాటు చేయడం జరిగింది. కానీ బిజెపి నాయకులు సీసీఐ ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి ఎంపీ ఎమ్మెల్యేగా గెలిచి ఇప్పుడు సీసీఐ ని శాశ్వతంగా తుక్కుగా మార్చేస్తున్నారని డిసిసి డా నరేష్ జాదవ్ అగ్రహం వ్యక్తం చేశారు. ఈ పాపం స్థానిక బిజెపి ఎమ్మెల్యే ఎంపీల దే అని అయన అన్నారు.కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం ఏకపక్ష ధోరణితో స్థానిక మున్సిపాలిటీ బకాయిలు రూపాయలు 5 కోట్లు, విద్యుత్ బిల్లు 20 కోట్లు, స్థానిక అర్లి గ్రామ పంచాయతి బకాయిలు చెల్లించకుండా, స్థానిక ప్రభుత్వాన్ని చట్టాలని గౌరవించకుండా సీసీఐ ని స్క్రాప్ కి టెండర్లు పిలిచి కూల్చి వేత పనులు ప్రారంభించడం చట్ట విరుద్ధం అక్రమ అన్యాయమని ఆయన అగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ బండారి అనూష సతీష్ , ఆదిలాబాద్ మార్కెట్ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాజీ డిసిసి సాజిద్ ఖాన్ మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి ఆదిలాబాద్ ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు ,జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం అధ్యక్షులు పరమేశ్వర్ , పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఖిజార్ పాషా గారు,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సుధాకర్ గౌడ్ , మాధవ్ పటేల్ ,గిమ్మ దీపక్ ,మాజీ టీటీడీ బోర్డు మెంబర్ బెజ్జంకి అనిల్ జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ లు గౌలి సంజయ్ , దేవిదాస్ చారీ, అక్తర్ అలీ గారు, చంద్ర శేఖర్ ,మందకిని సంగీత ,గుడి హత్నూర్ మండలం కాంగ్రెస్ అధ్యక్షులు దౌలత్ రావు , ఆదిలాబాద్ కాంగ్రెస్ రూరల్ మండలం అధ్యక్షులు వెంకట్ , యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షులు సామా రూపేష్ రెడ్డి దేరా కృష్ణా రెడ్డి కౌన్సిలర్ లు జీషన్, మెహబూబ్ ,సర్పంచ్ లు జిల్లా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మైత్రి డ్రగ్స్‌లో మృత్యుఘంటికలు..?

అమృత్ తెలంగాణ: జూన్ 12 : గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని బొంతపల్లి పారిశ్రామిక ప్రాంతంలోని మైత్రి డ్రగ్స్ పరిశ్రమలో జరిగిన ప్రమాదం ఓ యువ కార్మికుడి ప్రాణాన్ని బలిగొన్న ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం కసాల గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్ (25) విధులు నిర్వహిస్తుండగా ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం. సమాచారం ప్రకారం మూడు రోజుల క్రితమే పరిశ్రమలో ప్రమాదం జరిగినప్పటికీ విషయం బయటకు రాకుండా యాజమాన్యం ప్రయత్నించిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాదానికి గురైన కార్మికుడిని తొలుత సమీపంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు తెలుస్తోంది. అనంతరం పరిస్థితి విషమించడంతో నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం. ఘటనపై అధికారిక ప్రకటన లేకపోవడం, ప్రమాదానికి గల కారణాలు వెల్లడికాకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు సక్రమంగా అమలవుతున్నాయా? కార్మికుల ప్రాణాలకు రక్షణ ఉందా? అనే ప్రశ్నలు స్థానికులు, కార్మిక వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. కార్మికుడు మృతి చెందిన తర్వాతే విషయం వెలుగులోకి రావడం మరిన్ని సందేహాలకు కారణమవుతోంది. ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని, బాధిత కుటుంబానికి తగిన పరిహారం అందించి న్యాయం చేయాలని సీఐటీయూ, కార్మిక సంఘాలు, స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత శాఖల అధికారులు స్పందించి పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది. ప్రస్తుతం మైత్రి డ్రగ్స్ పరిశ్రమలో జరిగిన ఈ ఘటన పారిశ్రామిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్

ప్రతి పేదవాడు సొంతింటిలో సుఖంగా జీవించాలనే ఆకాంక్ష ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిది - ఆడే గజేందర్





రిబ్బన్ కట్ చేస్తున్న ఆడే గజేందర్

అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ బజార్హత్నూర్ మండలంలోని భూతాయి గ్రామంలో గ్రామ సర్పంచ్ రజాక్ గారితో కలిసి రఫిక్ గారికి చెందిన నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశంలో ముఖ్య అతిథిగా బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ గారు హాజరై ప్రారంభించారు ఈ సందర్భంగా ఆడే గజేందర్ గారు మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కల నెరవేరుతుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలకు గౌరవప్రదమైన నివాసం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది అని ఈ క్రమంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో కొత్తగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారులు గృహ ప్రవేశం చేస్తూ ఆనందోత్సాహాలతో సంబురాలు జరుపుకుంటున్నారాని. ప్రతి గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల పథకం పండుగ వాతావరణాన్ని నెలకొల్పుతోందనీ ఆడే గజేందర్ అన్నారు వారి వెంట జిల్లా గ్రంథాల చైర్మన్ మల్లెపూల నరసయ్య మండల అధ్యక్షులు విట్టల్,మాజీ మండల అధ్యక్షులు జలకే పాండురంగ్,భూమన్న, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల నియామకాలు పూర్తి పారదర్శకంగా నిర్వహించాం : జిల్లా కలెక్టర్ రాజర్షి షా



అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల నియామక ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించామాని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రీ-ప్రైమరీ పోస్టుల భర్తీ కోసం అర్హులైన అభ్యర్థులకు ముఖాముఖి (ఇంటర్వ్యూలు) నిర్వహించారు. ఈ ఎంపిక ప్రక్రియను జిల్లా కలెక్టర్ స్వయంగా పర్యవేక్షిస్తూ, అభ్యర్థుల నైపుణ్యాలు, అర్హతలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, చిన్న వయసులోనే పిల్లలకు నాణ్యమైన పునాది విద్య అందించడంలో ప్రీ-ప్రైమరీ ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో బోధనా ప్రమాణాలను మరింత మెరుగుపరచేందుకు అర్హత, ప్రతిభ కలిగిన అభ్యర్థులను మాత్రమే ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు. ఇంటర్వ్యూలలో అభ్యర్థుల కమ్యూనికేషన్ నైపుణ్యాలు, పిల్లలను ఆకట్టుకునే బోధనా పద్ధతులు, వారి వ్యక్తిత్వం, సేవా దృక్పథం వంటి అంశాలను ప్రధానంగా పరిశీలించినట్లు తెలిపారు. ఎంపిక ప్రక్రియ పూర్తిగా నిబంధనల ప్రకారం, మెరిట్ ఆధారంగా, పారదర్శకంగా నిర్వహించబడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, శిశు సంక్షేమ శాఖ అధికారి మిల్కా, జిల్లా విద్యాశాఖ అధికారులు, ఇంటర్వ్యూ కమిటీ సభ్యులు, అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే లక్ష్యంగా కీలక నిర్ణయాలు.. ఆదిలాబాద్ మార్కెట్ యార్డుల అభివృద్ధికి ఏకగ్రీవ తీర్మానం! - ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి





సమావేశమంలో మాట్లాడుతున్న ఏఎంసి చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (AMC)కి వచ్చే రైతుల శ్రేయస్సు మరియు వారికి మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పలు ప్రతిష్టాత్మక అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి వెల్లడించారు. గురువారం ఆయన అధ్యక్షతన వ్యవసాయ మార్కెట్ కమిటీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాలకవర్గం పలు అభివృద్ధి పనులకు ఏకగ్రీవంగా ఆమోదం తెలుపుతూ, ప్రభుత్వానికి మరియు మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాలని తీర్మానించింది. ఈ సమావేశంలో ప్రధానంగా రైతుల మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి పలు కీలక పనులను ఏకగ్రీవంగా ఆమోదించారు. అన్నదాతలు మార్కెట్ యార్డులో ఎలాంటి ఇబ్బందులు పడకుండా, వారికి పూర్తి సౌకర్యాలు కల్పించడానికే ఈ తీర్మానాలు చేసినట్లు చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ జనరల్ బాడీ సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ తన్వీర్ అహ్మద్ పటేల్, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, ఆదిలాబాద్ PACS చైర్మన్ మేస్త్రం పరమేశ్వర్, , జిల్లా మార్కెటింగ్ అధికారి (DMO) గజానంద్ , సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ విట్టల్, మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతులందరికీ పారదర్శకంగా ఎరువుల సరఫరా -జిల్లా కలెక్టర్ రాజర్షి షా



అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ జిల్లాలోని రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎరువుల సరఫరాను మరింత పారదర్శకంగా, సులభతరంగా అందించేందుకు 'యూరియా బుకింగ్ యాప్'ను విస్తృతంగా అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ మొబైల్ నంబర్ ద్వారా ఈ యాప్‌లో నమోదు చేసుకుని, యూరియాను ముందస్తుగా బుక్ చేసుకొని కొనుగోలు చేయవచ్చని ఆయన సూచించారు. ఈ యాప్ ద్వారా కౌలు రైతులు, పట్టా పాసు పుస్తకం లేని రైతులు సైతం తమ మొబైల్ నంబర్ సహాయంతో సులువుగా నమోదు చేసుకుని యూరియా పొందే అవకాశం కల్పించినట్లు సూచించారు. గత సంవత్సరం పంట నమోదులో రిజిస్టర్ కాని NDS & PP భూముల రైతులు, తమ పరిధిలోని మండల వ్యవసాయ అధికారిని సంప్రదించి యాప్‌లో పేరు నమోదు చేసుకోవాలని, తద్వారా తమ సాగు విస్తీర్ణానికి తగినట్లుగా యూరియా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. గతంలో నమోదు చేసిన మొబైల్ నంబర్‌లో మార్పులు ఉన్నా, లేదా యాప్ వినియోగంలో సమస్యలు ఎదురైనా వెంటనే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి నంబర్‌ను నవీకరించుకోవాలని సూచించారు. నెట్‌వర్క్ ఇబ్బందులు లేదా మొబైల్ సిగ్నల్ సరిగ్గా లేని ప్రాంతాల రైతులు, తమ సమీపంలోని రైతు వేదికల వద్దకు వెళ్లి యూరియా బుక్ చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ జిల్లా వానకాలం-2026 సీజన్ నిమిత్తం 45,000 మెట్రిక్ టన్నుల యూరియా అవసరాల కోసం హైదరాబాద్‌లోని వ్యవసాయ సంచాలకులకు సరఫరా ప్రణాళికలు పంపినట్లు వివరించారు. జిల్లాకు ఇప్పటివరకు 27,227 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కాగా, ప్రస్తుతం జిల్లాలో 23,233 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కాగా, ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 23,723 మంది రైతులు 95,645 బ్యాగులను బుక్ చేసుకోగా, అందులో 79,365 బ్యాగుల కొనుగోలు పూర్తయిందని వెల్లడించారు. రైతుల సౌకర్యార్థం యూరియా మొబైల్ యాప్ ప్రతిరోజూ ఉదయం 6:00 గంటల నుండి రాత్రి 10:00 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, యాప్ వినియోగంపై ఏవైనా సందేహాలు ఉంటే ఉదయం 10:00 నుండి సాయంత్రం 05:00 గంటల లోపు టోల్ ఫ్రీ నెంబర్ 1800-123-7157 ను సంప్రదించవచ్చని సూచించారు. ఇతరత్రా ఎలాంటి సమస్యలు తలెత్తినా జిల్లా హెల్ప్ లైన్ నెంబర్ 8977742855 కు ఫోన్ చేసి రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవాల్సిందిగా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# జిల్లాలో విజయవంతంగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి : జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా





అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో పాత్రికేయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 1 లక్షా 58 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంటను కొనుగోలు చేసి, గోదాములకు తరలించినట్లు వివరించారు. 1 లక్షా 75 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి మిల్లులు, గోదాములకు తరలించినట్లు పేర్కొన్నారు. 30 వేల మెట్రిక్ టన్నుల జొన్న పంట దిగుబడి రాగా, ఇప్పటికే 20 వేల మెట్రిక్ టన్నుల జొన్న పంటను కొనుగోలు చేశామని, మిగిలిన ధాన్యాన్ని మరో మూడు రోజుల్లో పూర్తిగా కొనుగోలు చేస్తామని తెలిపారు. పంట కొనుగోలుకు సంబంధించి, డబ్బులను ఎప్పటికప్పుడు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని వివరించారు. క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తి చేయగలిగామని చెప్పారు. రానున్న పంట కాలానికి సంబంధించి రైతులకు ఎరువుల కొరత రాకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రైతులెవరూ కూడా యూరియా లభ్యతపై ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని, జిల్లాలో సరిపడినంత యూరియా అందుబాటులో ఉందని అన్నారు. ప్రస్తుతం 10734 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. రైతులు వారి అవసరాన్ని బట్టి యూరియా బుకింగ్ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవాలని చెప్పారు. ప్రతి ఎరువుల దుకాణం వద్ద ప్రత్యేకంగా ఒక పోస్టరును అందుబాటులో ఉంచుతామని, ఇందులో ఎరువుల ధరలు, తదితర వివరాలు ప్రదర్శించబడతాయని అన్నారు. రైతుల వద్ద ఎరువుల కోసం అధిక ధరలు వసూలు చేస్తే, 8977751754 నంబరును సంప్రదించవచ్చునని వివరించారు. ఎరువుల దుకాణదారులు, రైతుల వద్ద నుంచి అధిక డబ్బులు తీసుకోరాదని హెచ్చరించారు. అధిక డబ్బులు తీసుకునే దుకాణదారులపై కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఇప్పటికే అధిక ధరలకు ఎరువులను విక్రయించిన పలు దుకాణదారులకు నోటీసులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. ఈనెల 26వ తేదీ నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభమవుతున్నందున, ప్రజలకు ఈ ప్రక్రియపై మీడియా మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ పాత్రికేయుల సమావేశంలో పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, మార్క్ ఫెడ్ డీఎం మహేష్, డిఆర్డిఓ విజయలక్ష్మి, హార్టికల్చర్ అధికారి రమణ, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విద్య అభివృద్ధికి ప్రభుత్వం కృషి : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ జూన్ 12, 2026: ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని తాండూర్ మండల కేంద్రంలో విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబా పూలే వసతి గృహ నిర్మాణానికి బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్, మండల తహసిల్దార్ జ్యోత్స్న, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, మహాత్మ జ్యోతిబాపూలే ఆర్ సి ఓ బాల భాస్కర్ లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో త్రాగునీరు, విద్యుత్, ప్రహరీ గోడ, మూత్రశాలలు ఇతర పూర్తి సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

ఈ క్రమంలో తాండూర్ మండలంలో 1 కోటి 95 లక్షల రూపాయల ఎస్ డి ఎఫ్ నిధుల అంచనా వ్యయంతో మహాత్మ జ్యోతిబాపూలే వసతి గృహ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలలో విద్యార్థినీ విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించడం జరుగుతుందని, ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం బెల్లంపల్లి పట్టణంలోని రామ్ నగర్ ప్రాంతంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అదనపు తరగతి గదులను జిల్లా కలెక్టర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్, బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ రమేష్, మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి, మండల విద్యాధికారి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 13 లక్షల 50 వేల రూపాయల సమగ్ర శిక్ష అంచనా నిధులతో పాఠశాల అదనపు తరగతి గదులు నిర్మించడం జరిగిందని తెలిపారు. గదుల నిర్మాణ పనులను వేగవంతం చేసి విద్యా సంవత్సరం ప్రారంభంలోగా పూర్తి చేసేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. విద్యా వ్యవస్థలో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కలిసిన కరత్వాడ ముంపు భాదితులు భూ నిర్వాసితులకు మోసం ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి





అమృత్ తెలంగాణ ఇచ్చోడా న్యూస్ బోథ్ మండలంలోని కరత్వాడ భూ నిర్వాసితులు శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముంపు బాధితులు మాట్లాడుతూ.. కరత్వాడ ప్రాజెక్టు నిర్మించి ఆనాడు భూ నిర్వాసితులకు మోసం చేశారని నష్టపరిహారం అందేలా చూడాలని ఎమ్మెల్యే ని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. తప్పకుండా కరత్వడ భూ నిర్వాసితులకు నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తారని భరోసా కల్పించారు. తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పూర్తి స్థాయి ఏర్పాట్లు : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ జూన్ 12, 2026: ఈ నెల 13వ తేదీన జిల్లాలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటన నేపథ్యంలో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని గూడెం శ్రీసత్యనారాయణ స్వామి ఆలయాన్ని డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గిరిజన సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ కొట్నాక తిరుపతి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, దండేపల్లి మండల తహసిల్దార్ రోహిత్ దేశ్ పాండే, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్, లక్షెట్టిపేట మున్సిపల్ కమిషనర్ విజయ్, ఆలయ ఈ.ఓ. శ్రీనివాస్ లతో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఈ నెల 13వ తేదీన ఉదయం జిల్లాలోని దండేపల్లి మండలం శ్రీ గూడెం సత్యనారాయణ స్వామి ఆలయం పునర్నిర్మాణం, మినీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్ లో సింగరేణిలో వైద్య పరంగా విధులు నిర్వహించలేని ఉద్యోగుల కుటుంబ సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తారని, సాయంత్రం శ్రీరాంపూర్ ఏరియాలో ఓపెన్ కాస్ట్ గనులను పరిశీలిస్తారని, అనంతరం మంచిర్యాల పట్టణంలో శ్రీ విశ్వనాథ ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ చేస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని వేంపల్లి ప్రాంతంలో గల పద్మావతి ఫంక్షన్ హాల్ లో ఏర్పాట్లను డి.సి.పి., మంచిర్యాల శాసనసభ్యులు, ఎ.సి.పి. ప్రకాష్ లతో కలిసి పరిశీలించారు. తదనంతరం మంచిర్యాల పట్టణంలోని కాలేజ్ రోడ్డులో గల పద్మనాయక ఫంక్షన్ హాల్ ను సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ తో కలిసి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పెద్దవాగు బ్రిడ్జిని వెంటనే మరమ్మతులు చేయాలి

అమృత్ తెలంగాణ : ఆలేరు మండలంలోని పెద్దవాగుపై ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరి ప్రజలకు నిత్యం ప్రాణసంకటంగా మారిందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు చెన్న రాజేష్,ఆలేరు పట్టణ అధ్యక్షులు వడ్డేమాన్ విప్లవ్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దవాగు బ్రిడ్జి నిర్మించి అనేక సంవత్సరాలు గడిచిపోవడంతో ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరి అత్యంత ప్రమాదకరంగా మారిందన్నారు. బ్రిడ్జి చాలా ఇరుకుగా ఉండటంతో నిత్యం తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిపారు. దీనివల్ల స్థానిక వ్యాపార వర్గాలు, చుట్టుపక్కల గ్రామాల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. బ్రిడ్జికి అవతల వైపున వ్యవసాయ మార్కెట్ యార్డు, ప్రభుత్వ ఆసుపత్రి, ఎంపీడీవో కార్యాలయం ఉండటంతో ప్రతిరోజూ వందలాది మంది ప్రజలు, రైతులు, గర్భిణీలు, రోగులు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బ్రిడ్జిని దాటాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ బ్రిడ్జిపై అనేక రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని, పలువురు తీవ్రంగా గాయపడి వికలాంగులుగా మారగా.. మరికొందరు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. సమస్య తీవ్రతను గుర్తించి ప్రభుత్వం తక్షణమే నిధులు మంజూరు చేసి బ్రిడ్జి మరమ్మతు పనులు ప్రారంభించాలని కోరారు.

# సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ప్రజా ఉద్యమంలా కొనసాగాలి - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

## నేరాల నియంత్రణ, ఛేదన, పరిశోధనలో సీసీటీవీ కెమెరాలు కీలకం

## గంజాయి రహిత జిల్లా నిర్మాణానికి ప్రతి ఒక్కరు సహకరించాలి

## రోడ్డు భద్రత, హెల్మెట్ వినియోగంపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలి




అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పట్టణ కౌన్సిలర్లకు, ఆరు మండలాల సర్పంచులకు సీసీటీవీ ప్రాధాన్యతలపై అవగాహన సదస్సు నిర్వహణ ఆదిలాబాద్ జిల్లాలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ఒక ప్రజా ఉద్యమంలా కొనసాగాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ అన్నారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో స్థానిక కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆదిలాబాద్ పట్టణ కౌన్సిలర్లు, ఆదిలాబాద్ రూరల్, జైనథ్, బీంపూర్, బేల, తాంసి, తలమడుగు మండలాల సర్పంచ్‌లతో సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యతపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ సీసీటీవీ కెమెరాల అవసరం, వాటి ద్వారా సమాజానికి కలిగే ప్రయోజనాలపై ప్రజాప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, సీసీటీవీ కెమెరాలు నేరాల నివారణలోనే కాకుండా, నేరాల ఛేదన, దర్యాప్తు, నిందితుల గుర్తింపులో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. జిల్లాలో గతంలో సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా ఛేదించిన పలు నేరాలకు సంబంధించిన వీడియోలను ప్రదర్శించి, వాటి ప్రాముఖ్యతను వివరించారు. నేరం చేసిన వారు ఎవరు అనేది నిర్ధారించడంలో, నేరం చేసిన పద్ధతి, నేరస్తులను కనుగొనే విధానం, మరో నేరం చేయకుండా అడ్డుకునే స్థితి సీసీటీవీ కెమెరాల వల్ల సాధ్యమవుతుందని వివరించారు. ప్రతి గ్రామం, ప్రతి కాలనీ, ప్రతి ప్రధాన కూడలిలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ప్రజాప్రతినిధులు ముందుండి కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా జిల్లాను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా కాపాడాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారిని సరైన చికిత్స ద్వారా సాధారణ జీవితంలోకి తీసుకురావచ్చని, అలాంటి వారి సమాచారం పోలీసులకు అందిస్తే డి-అడిక్షన్ సెంటర్ల ద్వారా చికిత్స అందజేస్తామని తెలిపారు. గ్రామాల్లో గంజాయి వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సర్పంచ్‌లకు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, హెల్మెట్ వినియోగంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ప్రజాప్రతినిధులను కోరారు.సదస్సులో పాల్గొన్న ప్రజాప్రతినిధులు తమ గ్రామాలలో, వార్డుల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తామని జిల్లా ఎస్పీకి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, వైస్ చైర్మన్ మహమ్మద్ రోహిత్, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, సీఐలు బి. సునీల్ కుమార్, కె. నాగరాజు, బి.డి. ప్రేమ్ కుమార్, జి. శ్రావణ్, రహీం పాషా, స్థానిక కౌన్సిలర్లు, మండలాల సర్పంచ్‌లు, ఆర్ఎస్ఐ మహేష్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సినిమా సినిమాకీ లాంగ్ గ్యాప్.. రీజన్ చెప్పిన మృణాల్



మొదట బుల్లితెరపై సందడి చేసిన ఈ నార్త్ భామ తర్వాత మెల్లిగా సినిమాల్లోకి వచ్చి వెండితెరపై కనిపించింది. ఏదైనా దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలంటారు పెద్దలు. అలా కాకుండా అంతా అయిపోయాక ఎంత చక్కబెట్టాలన్నా మొత్తం శూన్యంలానే కనిపిస్తుంది. ఇప్పుడు హీరోయిన్ మృణాల్ ఠాకూర్ ది కూడా అదే సిట్యుయేషన్. మొదట బుల్లితెరపై సందడి చేసిన ఈ నార్త్ భామ తర్వాత మెల్లిగా సినిమాల్లోకి వచ్చి వెండితెరపై కనిపించింది. అయితే మృణాల్ తన సినీ జీవితాన్ని ముందుగా మొదలుపెట్టింది మరాఠీ సినిమాలతో. ఆ తర్వాత బాలీవుడ్ కు వెళ్లి అక్కడ పలు హిందీ సినిమాల్లో నటించింది. కానీ తన శ్రమకు తగ్గ ఫలితాన్ని మాత్రం మృణాల్ బాలీవుడ్ లో అందుకోలేక పోయింది. సరిగ్గా అదే టైమ్ లో మృణాల్ కు తెలుగులో సీతారామం సినిమాలో నటించే అవకాశం దక్కింది. సీతారామంలో దుల్కర్ సల్మాన్ సరసన సీత పాత్రలో నటించిన మృణాల్ ఒక్క సినిమాతోనే టాలీవుడ్ ప్రేక్షకుల్ని కట్టిపడేసింది. తన నటనతో అందరినీ మెప్పించి వావ్ అనిపించింది. దానికి తగ్గట్టే ఆ సినిమా కూడా బ్లాక్ బస్టర్ గా నిలిచింది. సీతారామం తర్వాత మృణాల్ కు తెలుగులో వరుస పెట్టి అవకాశాలు వచ్చాయి. దీంతో ఇక మృణాల్ మళ్లీ వేరే ఇండస్ట్రీ వైపు చూసింది లేదు. రెండో సినిమాగా నాని తో చేసిన హాయ్ నాన్న సినిమా కూడా సూపర్ హిట్ అయింది. అదే టైమ్ లో మృణాల్ కు కోలీవుడ్ నుంచి శివ కార్తికేయన్ కు జంటగా ఏ ఆర్ మురుగదాస్ దర్శకత్వంలో ఓ సినిమా ఛాన్స్ వచ్చింది. కారణాలేంటో తెలీదు కానీ మృణాల్ మాత్రం ఆ అవకాశాన్ని వద్దనుకుంది. . మిడ్ నైట్ 2.30కి షాక్ ఇచ్చిన పాకిస్థానీ! కోలీవుడ్ ఛాన్స్ వద్దనుకుని అదే టైమ్ లో మృణాల్ టాలీవుడ్ లో చేసిన ఫ్యామిలీ స్టార్ సినిమా డిజాస్టర్ అయింది. ఆ తర్వాత నుంచి ఇప్పటివరకు మృణాల్ కు కోలీవుడ్ నుంచి మరో ఆఫర్ వచ్చింది లేదు. గ్లామర్ విషయంలో ఎలాంటి కండిషన్స్ పెట్టకపోయినా అమ్మడికి సినిమా అవకాశాలు తగ్గాయనేది మాత్రం వాస్తవం. అయితే రీసెంట్ గా మృణాల్ ను ఎందుకు ఎక్కువ సినిమాలు చేయడం లేదని అడగ్గా, తను చేస్తున్న పాత్రలను ఆడియన్స్ ఆదరిస్తున్నారని అందుకే పాత్రల ఎంపికలో ఆచితూచి అడుగులేస్తున్నట్టు మృణాల్ తెలిపింది.

# మాళవిక ప్లేస్ కొట్టేసిన శృతి హాసన్..?



ప్రభాస్ రాజా సాబ్ సినిమా మీద చాలా ఆశలు పెట్టుకున్న అమ్మడు ఆ సినిమాతో తన రేంజ్ పెరుగుతుందనే ఆలోచనలో ఉంది. మలయాళ భామ మాళవిక మోహనన్ త్వరలో రాజా సాబ్ తో తెలుగు ఎంట్రీ ఇస్తుంది. ఐతే డైరెక్ట్ తెలుగు సినిమా చేయలేదు కానీ మాస్టర్ తో అమ్మడు తెలుగు ఆడియన్స్ ముందుకు వచ్చింది. తమిళ్ లో ఇప్పటికే ఆడియన్స్ ని అలరిస్తున్న మాళవిక తెలుగు ఆడియన్స్ మనసులు గెలుచుకోవాలని చూస్తుంది. ప్రభాస్ రాజా సాబ్ సినిమా మీద చాలా ఆశలు పెట్టుకున్న అమ్మడు ఆ సినిమాతో తన రేంజ్ పెరుగుతుందనే ఆలోచనలో ఉంది. ఇదిలాఉంటే లోకేష్ కనకరాజ్ తో మాస్టర్ సినిమా చేసిన మాళవిక ఆ టైం లోనే కూలీ సినిమా గురించి డిస్కషన్ వచ్చిందట. రజనీ కూతురిగా ముందు తననే అనుకున్నారని కాకపోతే ఆ ఛాన్స్ మిస్ అయ్యిందని అంటుంది మాళవిక. ప్రస్తుతం లోకేష్ కనకరాజ్ సూపర్ స్టార్ రజినీతో కూలీ సినిమా చేస్తున్నారు. ఆ సినిమాలో శృతి హాసన్ ఫిమేల్ లీడ్ గా నటుస్తుంది. రజిని కూతురిగా ఈ సినిమాలో శృతి హాసన్ కనిపిస్తుందని తెలుస్తుంది. ఐతే లోకేష్ ఈ పాత్ర కోసం ముందు మాళవికని అనుకున్నారని తెలుస్తుంది. ఐతే మరి ఆమెను ఎందుకు వద్దనుకున్నారో ఏమో కానీ మాళవిక ప్లేస్ లో శృతి హాసన్ వచ్చి చేరింది. ఐతే శృతి హాసన్ ఈమధ్యనే లోకేష్ కనకరాజ్ తో ఒక వీడియో సాంగ్ చేసింది. ఆ కాంబినేషన్ సెట్ అవ్వడం వల్ల ఈ ఛాన్స్ వచ్చి ఉండొచ్చని అంటున్నారు. ఈమధ్య శృతి హాసన్ తన దాకా వచ్చిన ఛాన్స్ లను వదిలేస్తుంది. అడివి శేష్ తో డెకాయిట్ సినిమా ముందు శృతి హాసన్ నే హీరోయిన్ గా ఫిక్స్ చేయగా మధ్యలో ఏమైందో ఏమో కానీ ఆమె ప్లేస్ లో మృణల్ ఠాకూర్ ని తీసుకున్నారు. లాస్ట్ ఇయర్ ప్రభాస్ తో సలార్ 1 సినిమా చేసిన అమ్మడు నెక్స్ట్ తెలుగు సినిమా ఏది ఓకే చేయలేదు. తమిళ్ లో కూడా శృతి హాసన్ కేవలం కూలీ ఒక్కటే చేస్తుంది. అక్కడ మాళవిక ప్లేస్ లో శృతి హాసన్ వస్తే.. ఇక్కడ శృతి ప్లేస్ లో మృణాల్ వచ్చింది. మరి శృతి కెరీర్ మీద అంత ఫోకస్ గా లేదన్న టాక్ ఎప్పటినుంచో వినిపిస్తుంది. అంతకుముందు ఏమో కానీ ఇప్పుడు కొత్త హీరోయిన్స్ చాలామంది ఆప్షన్స్ ఉన్నారు కాబట్టి ఆమెను లైట్ తీసుకునే ఛాన్స్ ఉంటుంది.

# సలీం కోసం అనార్ వెయిటింగ్



తాజాగా షామా షేర్ చేసిన ట్రెడిషనల్ శారీ లుక్ ఇంటర్నెట్ ని మరిగిస్తోంది. షామా శికందర్ పరిచయం అవసరం లేదు. వరస ఫోటోషూట్‌లతో అగ్గి రాజేస్తున్న ఈ బ్యూటీ బోల్డ్ / డస్కీ లుక్స్ తో హృదయాల్ని టచ్ చేస్తుంది. తాజాగా షామా షేర్ చేసిన ట్రెడిషనల్ శారీ లుక్ ఇంటర్నెట్ ని మరిగిస్తోంది. చీరలో షామా ముగ్ధ మనోహర రూపానికి యూత్ ఫిదా అయిపోతోంది. షామా ఈ కొత్త లుక్ లో సంథింగ్ స్పెషల్ గా కనిపిస్తోంది. దేవదాస్ కోసం ఎదురు చూస్తున్న పార్వతిలా.. సలీం కోసం వెయిటింగ్ లో ఉన్న అనార్ లాగా కనిపిస్తోందంటూ అభిమానులు కామెంట్ చేస్తున్నారు. సింపుల్ శారీకి డిజైనర్ బ్లౌజ్ కాంబినేషన్ పర్ఫెక్ట్ ఫిట్ గా కనిపిస్తోంది. చేతిలో కలువ రేకు బూరె బుగ్గను తాకుతుంటే యథాలాపంగా ఏదో ఆలోచిస్తూ కనిపించింది. షామా ట్రెడిషనల్ లుక్ కి బంగారు వర్ణం డిజైనర్ పరికిణీ, చెవులకు ఆ పొడవాటి జూకా అదనపు ఆకర్షణగా మారింది. ఈ లుక్ చూడగానే విరహంతో వీగిపోతున్న రాణిలా కనిపిస్తోందంటూ కొందరు అభిమానులు పొగిడేస్తున్నారు. యే మేరీ లైఫ్ హై ఫేమ్.. నటి షామా.. జేమ్స్ మిల్లిరోన్ తో రొమాంటిక్ డేట్ లో ఉన్న సంగతి తెలిసిందే. డేటింగ్ వ్యవహారం ఎలా ఉన్నా కానీ, షామా ఇప్పటికీ బాలీవుడ్ లో అవకాశాల కోసం వేటను ఆపలేదు. సౌత్ సినీపరిశ్రమలపైనా దృష్టి సారించిందని కథనాలొచ్చాయి.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# దిశా పటానీ బిగ్ బ్లో..



షాకవ్వాలంతే ఇదిగో ఇక్కడ దిశా పటానీ లేటెస్ట్ ట్రెండీలుక్ తో కుర్రకారు హృదయాల్లో గిలిగింతలు పెడుతోంది. ట్రెడిషనల్ లెహంగా.. ఇంకేవైనా.. దుస్తులు ఏవి? అనేది ముఖ్యం కాదు. వాటిని ప్రదర్శిస్తున్నది ఎవరు? అనేదే ముఖ్యం. కొందరు డ్రెస్ తొడిగితే ఆ డ్రెస్ కే అందం వస్తుంది. ఇదే కేటగిరీకి చెందుతుంది దిశా పటానీ. ఇదిగో ఇక్కడ దిశా పటానీ లేటెస్ట్ ట్రెండీలుక్ తో కుర్రకారు హృదయాల్లో గిలిగింతలు పెడుతోంది. అంటూ ఎల్లే ఇండియా – ది ఎల్లే లిస్ట్ 2024 పేరుతో రిలీజ్ చేసిన ఈ స్పెషల్ ఫోటోషూట్ కుర్రకారు వాట్సాప్ లలో వైరల్ గా మారుతోందంటే దానిలో ఎంత ఎలివేషన్ కనిపిస్తోందో అర్థం చేసుకోవాలి. పటానీ ఎంపిక చేసుకున్న డిజైనర్ డ్రెస్ లో ఎంతో హాలి గా కనిపిస్తోంది. ముఖ్యంగా తన అందాలను ఎలివేట్ చేయడంలో ఈ డ్రెస్ అద్భుతంగా సెట్టయిందని చెప్పాలి కెరీర్ మ్యాటర్ కి వస్తే .. ఇటీవల కల్కి 2898 ఏడి చిత్రంలో కనిపించింది దిశా పటానీ. తదుపరి సీక్వెల్ లోను కనిపించనుంది. మరోవైపు వెల్ కం టు ది జంగిల్ లాంటి భారీ మల్టీస్టారర్ చిత్రంలోను దిశా నటిస్తోంది. ఇవేగాక, తన తదుపరి చిత్రాల గురించి అప్ డేట్ చెప్పాల్సి ఉంది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- sigidiamruth404@gmail.com